సాక్షి రంగారెడ్డి

బుధవారం । 18 । డిసెంబర్ । 2024



పర్సు అప్పగింత

బస్సులో పోగొట్టుకున్న పర్సును తిరిగి ప్రయాణికురాలికి అప్పగించిన సంఘటన ఆమనగల్లు బస్టాండ్‌లో చోటుచేసుకుంది. 8లో▸



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని..

విద్యుత్ స్తంభాన్ని తవేరా వాహనం ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన టోల్‌ప్లాజావద్ద జరిగింది. 8లో▸



అందనంత దూరం

ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకానికి నిధులు కేటాయించకపోవడంతో విద్యార్థులు అర్ధాకలితో చదువుకుంటున్నారు. 8లో▸

పడిగాపులు



చేవెళ్లలోని సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద వేచి ఉన్న వాహనాలు

సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ని'బంధనాలు'

- రోజుకు 500 క్వింటాళ్లే కొనుగోలు
- పరిమితి దాటితే తప్పని నిరీక్షణ
- ఆందోళనలో పత్తి రైతులు
- అదనపు భారం పడుతోందని ఆవేదన

చేవెళ్ల: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు పత్తి రైతులు నానా పాట్లు పడాల్సి వస్తోంది. సీసీఐ కేంద్రాల వద్ద రోజుకు ఇంతే కొంటామనే పరిమితి విధించడంతో రైతులకు రోజుల తరబడి మిల్లుల వద్ద పడిగాపులు తప్పడం లేదు. చేవెళ్ల మండలంలోని శ్రీనివాస కాటన్‌మిల్లు వద్ద ప్రభుత్వం నెల రోజుల కిత్రం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. డివిజన్‌తో పాటు చుట్టు పక్కల మండలాల రైతులు సైతం పత్తిని అమ్ముకునేందుకు వస్తున్నారు. ప్రతిరోజు దాదాపు 1000 క్వింటాళ్లకుపైగా తీసుకువస్తున్నారు. కానీ ఇక్కడ రోజుకు 500 క్వింటాళ్ల వరకు మాత్రమే కొనుగోలు చేయాలనే పరిమితి విధించారు. దీంతో సగం మంది రైతులు ప్రతిరోజు కొనుగోలు కేంద్రం వద్ద ఇబ్బందులు పడుతున్నారు. పరిమితి దాటిపోతే మరుసటిరోజు వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో వాహనాల అద్దెలు రెట్టింపు అవుతున్నాయి.

ఎలా అమ్ముకునేది..?

పండించిన పంటను అమ్ముకోవాలంటే నానా ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. పరిమితి లేకుండా రోజు వారీగా వచ్చిన రైతులవి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వారంలో శని, ఆదివారాలు సెలవు ఉండటంతో పాటు మిగతా ఐదు రోజుల్లో ఏ సమస్య వచ్చినా ఇబ్బంది తప్పడం లేదని అంటున్నారు. నడిచే మూడు నాలుగురోజులు కూడా నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లు వద్ద సరైన సిబ్బంది లేకపోవడంతో ఆలస్యం అవుతోందని, తెచ్చిన పత్తిని ఎలా అమ్ముకోవాలని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం, వ్యవసాయ, సీసీఐ అధికారులు స్పందించి కొనుగోలు పరిమితిని పెంచాలని, రోజుకు కనీసం 1000 క్వింటాళ్ల కొనుగోలుకు అనుమతించాలని కోరుతున్నారు.



సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద కాంటా చేసేందుకు వెళ్తున్న పత్తి వాహనాలు

పొద్దుగాళ్ల వస్తే పొద్దీకే..



రెండు ఎకరాల్లో పత్తి పంట వేశాను. వచ్చిన పత్తిని అమ్ముకునేందుకు రూ.2వేల కిరాయి పెట్టి వాహనంలో వచ్చాను. తెల్లవారుజామున 5 గంటలకు వచ్చి బండి లైన్‌లో పెట్టాను. సాయంత్రం అయినా కొనుగోలు చేయలేదు. ఒకరోజు దాటితే మరోరోజుకు రూ.2వేలు అదనంగా కిరాయి పడుతుంది.

– ఎం.జంగయ్య, రైతు, దామరగిద్ద

పరిమితి ఎత్తివేయాలి



ఏడాదికాలం సాగు చేసిన పత్తిని అమ్ముకునేందుకు వస్తే అడుగడుగున్నా ఇబ్బందులే ఎదురవుతున్నాయి. నేరుగా అమ్ముకునేందుకు ఏర్పాట్లు లేకపోవటం బాధాకరం. ఓవైపు ధర తక్కువ చేసి.. మరోవైపు పరిమితి విధించడం సరికాదు. కొనుగోలుకు విధించిన పరిమితిని ఎత్తి వేయాలి.

– విష్ణుబాబు, రైతు, రామన్నగూడ

అనుమతి మేరకు కొంటున్నాం

చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రానికి రోజుకు 500 క్వింటాళ్ల పరిమితి మాత్రమే ఉంది. మిల్లు కెపాసిటీ మేరకు అధికారులే ఇలా నిర్ణయించారు. అయినా రైతులకు ఇబ్బంది లేకుండా 700 క్వింటాళ్ల వరకు కొంటున్నాం. అంతకు మించితే ఉన్నతాధికారులు, సీసీఐ నుంచి అనుమతి రావాలి.

– మహేందర్,
మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, చేవెళ్ల



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజనం కార్మికులు

అట్టుడికిన కలెక్టరేట్

- మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా
- వాహనాలు రాకుండా గేట్లకు అడ్డు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- సొమ్మసిల్లి పడిపోయిన ఓ కార్మికురాలు



సొమ్మసిల్లి పడిపోయిన కార్మికురాలు లలిత

ఇబ్రహీంపట్నం రూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నాతో కలెక్టరేట్ అట్టుడికింది. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ చేపట్టిన 48 గంటల ధర్నా విజయవంతమైంది. కార్మికుల నినాదాలతో కలెక్టరేట్ ప్రాంగణం మార్మోగింది. ముఖ్యమంత్రి డౌన్‌డౌన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. కలెక్టరేట్ గేట్ల ముందు బైఠాయించారు. కార్యాలయంలోకి కార్లు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్న పానీయాలు మాని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ఇప్పటికే మధ్యాహ్న భోజనం కార్మికులు అప్పులపాలయ్యారని, పుస్తెలు తాకట్టు పెట్టి వంటలు వండి పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. ధర్నా చేస్తుండగా బాటసింగారం గ్రామానికి చెందిన మధ్యాహ్న భోజనం కార్మికురాలు లలిత సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే ఆమెను కలెక్టరేట్‌లోని ఆస్పత్రికి తరలించి వైద్యసాయం అందించారు. అక్కడి నుంచి 108 వాహనాన్ని పిలిపించి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

హామీ ఇవ్వడంతో ఆందోళన విరమణ

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన చేసిన కార్మికులు కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పాలని నినదించారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో విద్యాశాఖ అడిషనల్ డీఈఓ వచ్చి మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రెండు నెలల బిల్లులు ఖాతాల్లో పడ్డాయని మిగతావి త్వరలో వస్తాయన్నారు. బ్యాంకుల్లో, లేదా ఎస్టీఓల్లో ఆగి ఉంటాయేమోనని, తప్పకుండా వస్తాయని హామీ ఇచ్చారు. దీంతో వారు పది రోజుల్లో సమస్య పరిష్కారం కాకుంటే మళ్లీ ఆందోళన చేస్తామని హెచ్చరించి విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పోచమోని కృష్ణ, రుద్రకుమార్, పెంటయ్య, సరిత, అలివేలు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

డీఎస్సీ 2024 టీచర్లకు వేతనాలు ఇవ్వండి



డీటీఓకు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: డీఎస్సీ 2024 ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలు చెల్లించి ఆదుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో డీటీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప మాట్లాడుతూ.. ఉద్యోగాల్లో చేరి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. కొత్త జీతం అందుకునే ఆనందానికి దూరమయ్యారన్నారు. జీతాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని, వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కిషన్‌నాయక్, ఇతర నాయకులు శంకర్ నాయక్, బొడ్డుపల్లి రాములయ్య, జహీర్ అజాద్, జె.కృష్ణ, పబ్బతి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలను అడ్డుకున్న రైతులు



యాచారం: మండల పరిధిలోని కుర్మిద్దలో ఫార్మాసిటీకి సేకరించిన పట్టా, అసైన్డ్ భూముల్లో మంగళవారం టీజీఐఐసీ అధికారులు భూసార పరీక్షలు నిర్వహించారు. సాంకేతిక ఇంజినీరింగ్ బృందం సర్వే నంబర్ 286, 287లలో ఉదయం 9 గంటలకే పెద్ద పెద్ద యంత్రాలు బిగించి భూసార పరీక్షలకు సిద్ధమయ్యారు. అధికారులు సమాచారం లేకుండానే తమ పట్టా భూముల్లో భూసార పరీక్షలు చేయడంపై రైతులు మండిపడ్డారు. దీంతో వారు యంత్రాలను తీసుకుని వెళ్లిపోయారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలి



రావిర్యాలలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

తుక్కుగూడ: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తప్పులు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని రావిర్యాల గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను మంగళవారం ఆమె మున్సిపల్ కమిషనర్ వాణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా పాలన సందర్భంగా చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా సర్వే చేస్తున్నట్టు చెప్పారు. తమ ఇంటికి వచ్చినప్పుడు అధికారులకు గృహాలకు సంబంధించిన ప్రతాలు చూపించి సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మల్లేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అవసరమైన చోట నూతన గ్రంథాలయాలు



మధుసూదన్‌రెడ్డిని సన్మానించిన స్థానిక నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలో అవసరమైన చోట గ్రంథాలయాలు మంజూరు చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తులేకలాన్ గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. నూతన గ్రంథాలయ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 300 మంది యువత ఉన్న గ్రామంలో గ్రంథాలయం లేకపోవడం బాధాకరమన్నారు. నూతన గ్రంథాలయం ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అతి త్వరలోనే భూమిపూజ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్, సీనియర్ నాయకులు శశాంక్‌రెడ్డి, బోడ మహేందర్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు బోడ విజయ్, ధర్మతేజ, పాండు, మల్లేష్, సామ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మ్యాప్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

'ఇస్తేమా'కు ఏర్పాట్లు చేయండి

అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం

శంకర్‌పల్లి: పట్టణంలో వచ్చేనెల 3,4,5 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే 'ఇస్తేమా' కార్యక్రమం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శంకర్‌పల్లిలో ఇస్తేమా జరిగే ప్రదేశాన్ని మంగళవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మితో కలిసి పరిశీలించారు. అనంతరం అధికారులు, పోలీసులు, ముస్లిం పెద్దలతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇస్తేమా కోసం రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల్లో ముస్లింలు వస్తారని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. మూడు రోజుల పాటు ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామని, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ మానిటరింగ్ చేస్తారని తెలిపారు. విద్యుత్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, పంచాయతీ రాజ్, రెవెన్యూ, రోడ్లుభవనాలు, పోలీసు అన్ని విభాగాలు సమన్వయం చేసుకోవాలన్నారు. పనులకు సంబంధించిన అంచనాల నివేదికలను అందిస్తే నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈనెల 25వ తేదీలోపు ఏరాట్లు పూర్తి చేసి, 31వ తేదీ వరకు ట్రయల్ ప్రారంభించాలని ఆదేశించారు. ఈనెల 25 తర్వాత మళ్లీ వచ్చి పరిశీలించనున్నట్టు చెప్పారు. సమావేశంలో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రెసిడెంట్ ఫహీయుద్దీన్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పట్టవా?



దీక్షకు సంఘీభావం తెలిపిన బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. కొద్ది రోజులుగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన కోరికలను తీర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇస్తున్న నిధులతోనే నెట్టుకొస్తోందని, నయాపైసా కూడా ఖర్చు చేయడం లేదని విమర్శించారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టి రాములు, మీడియా సెల్ కన్వీనర్ ఉడుతల అశోక్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ సంఘీభావం

సమగ్ర శిక్షా ఉద్యోగులకు టీఎస్‌యూటీఎఫ్ సంఘీభావం తెలిపింది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్ నాయక్, వెంకటప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

క్రిస్మస్ కోలాహలం!

నగరంలో క్రిస్మస్ కోలాహలం మొదలైంది. ఈ నెల 25న జీసస్ జన్మదినం.. క్రైస్తవులకు పర్వదినం. ఈ సందర్భంగా క్రిస్మస్ ట్రీలు, శాంటాక్లాజ్ బొమ్మలు, క్రిస్మస్ స్టార్‌ల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రీ కిస్మస్ వేడుకలు, కేక్ మిక్సింగ్‌లతో సందడి వాతావరణం నెలకొంది. పంజాగుట్టలోని ఓ షాపింగ్ మాల్‌లో మంగళవారం ఈ దృశ్యాలు కనిపించాయి.







ఆశల రేషన్!



సంక్రాంతి తర్వాత నయా కాంతులేనా!

- కొత్త రేషన్ కార్డులపై పేదల ఆశలు
- ఏడాదిగా మీ సేవ చుట్టూ చక్కర్లు
- అంతకుముందు ఆరేళ్లూ ఇదే దుస్థితి
- గ్రేటర్‌లో 10 లక్షలకుపైగా కుటుంబాల ఎదురుచూపులు



సాక్షి, సిటీబ్యూరో: 'సంక్రాంతి పండగ తర్వాత కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను ప్రారంభిస్తాం. ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు జారీ చేస్తాం' .. అసెంబ్లీ సాక్షిగా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ ఏడాది ఆరంభంలో నిర్వహించిన ప్రజాపాలనలో పేద కుటుంబాలు ఆరు గ్యారంటీల పథకాలతో పాటు ప్రత్యేకంగా రేషన్ కార్డుల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నాయి. అయినా ఇప్పటి వరకు ఎలాంటి కదలిక లేకుండా పోయింది. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కొత్త రేషన్ కార్డుల జారీని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని ప్రకటించారు. అప్పట్లో లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చింది.. ముగిసింది. కానీ.. ప్రక్రియ మాత్రం ప్రారంభం కాలేదు. పేదలు మాత్రం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ చుట్టూ చక్కర్లు కొడుతూనే ఉన్నారు. తాజాగా ప్రభుత్వం మరోసారి హామీ ఇవ్వడంతో కొత్త రేషన్ కార్డుల ప్రక్రియపై ఆశలు చిగురిస్తున్నాయి.

ఆన్‌లైన్ ద్వారానే..

- పౌరసరఫరాల శాఖ సంస్కరణలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా సేవలు ప్రారంభించింది. కొత్త రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్ లాగిన్ ద్వారానే దరఖాస్తులను స్వీకరించి కొత్త కార్డులను మంజూరు చేస్తూ వస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ఉమ్మడి రాష్ట్రంలో మంజూరు చేసిన తెల్ల రేషన్ కార్డులను రద్దు చేసి వాటి స్థానంలో ఆహార భద్రత కార్డులుగా మార్పు చేసింది. కొత్త కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అంటూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి కొద్దికాలం జారీ పక్రియ కొనసాగించింది.
- నాలుగేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల చేసుకునే పౌరసరఫరా శాఖ వెబ్‌సైట్ ఆన్‌లైన్ లాగిన్‌ను నిలిపివేసి అప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో కేవలం 40 శాతం మాత్రమే క్లియర్ చేసి మిగతా దరఖాస్తులను తిరస్కరించింది. అప్పటి నుంచి కొత్త కార్డుల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కూడా లేకుండాపోయింది. తాజాగా ఆ లాగిన్ పునఃప్రారంభమై గ్రీన్ సిగ్నల్ లభిస్తే దరఖాస్తుల ప్రక్రియ ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి

మొత్తం 40 లక్షల కుటుంబాలు..

నగరంలో సుమారు 10 లక్షల కుటుంబాలకుపైగా రేషన్ కార్డులు లేవు. సుమారు కోటిన్నర జనాభా ఉన్న భాగ్యనగరంలో దాదాపు 40 లక్షల కుటుంబాలు ఉన్నాయి. అందులో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబాలు 27.21 లక్షల వరకు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం హైదరాబాద్‌–రంగారెడ్డి జిల్లా, మేడ్చల్ జిల్లాలో 17.21 లక్ష కుటుంబాలు మాత్రమే తెల్ల రేషన్‌కార్డులు కలిగి ఉన్నాయి. మిగతా కుటుంబాలు రేషన్ కార్డులు లేక వివిధ సంక్షేమ పథకాల వర్తింపు కోసం తల్లడిల్లుతున్నాయి.

పెండింగ్‌లో 5.73 లక్షల దరఖాస్తులు

ఇప్పటికే సుమారు 5.73 లక్షల కుటుంబాలు కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రజా పాలనా కార్యక్రమం నిర్వహించగా సుమారు 24 లక్షల 74 వేల 325 కుటుంబాలు వివిధ పథకాల వర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. అందులో అయిదు గ్యారంటీల కోసం సుమారు 19,01,256 కుటుంబాలు, రేషన్ కార్డు కోసం 5,73,069 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

వైన్స్‌లో చోరీ

రూ. 5వేలు, 20వేల విలువగల మద్యం బాటిళ్లు అపహరణ



చోరీకి గురైన వైన్స్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో బైపాస్ రోడ్డులోని లక్కీ వైన్స్‌లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వైన్స్ యజమాని కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వైన్స్ దుకాణాన్ని రోజుమాదిరిగా మూసి వేసి వెళ్లారన్నారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో వైన్ షాపు వెనక నుంచి తలుపులు గడ్డపారతో పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి చొరబడ్డారన్నారు. అక్కడ కౌంటర్‌లోని రూ.5వేలతో పాటు సుమారు రూ. 20వేల విలువ గల మద్యం బాటిళ్లు, సీసీ కెమెరాల హార్డు డిస్కును కూడా దొంగిలించినట్లు ఆయన వివరించారు. ఈ విషయం గురించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కృష్ణ పేర్కొన్నారు.

యువతి అదృశ్యం


మౌనిక (ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. సర్దార్‌నగర్‌కు చెందిన దేవర మాధవి, లక్ష్మయ్య దంపతుల కుమార్తె మౌనిక (19) ఇంటర్ వరకు విద్యనభ్యసించి ఇంటి వద్దే ఉంటుంది. ఈ నెల 12న ఉదయం వారు డ్యూటీకి వెళ్లిన సమయంలో కుమారుడు, కుమార్తె ఇంటి వద్దే ఉన్నారు. రాత్రి వచ్చేసరికి కుమార్తె కనిపించలేదు. పక్కింటికి వెళ్లొస్తానని చెప్పిందని కుమారుడు సమాధానమిచ్చారు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో వారు జక్కుల హేమంత్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ వైర్లు తాకి వరిగడ్డి దగ్ధం

పాక్షికంగా డీసీఎం వ్యాన్..


దగ్ధమైన వరిగడ్డితో డీసీఎం

మొయినాబాద్: విద్యుత్ వైర్లు తాకి వరిగడ్డి పూర్తిగా కాలిపోయింది. డీసీఎం వ్యాన్ పాక్షికంగా దగ్ధమైంది. ఈ సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట నుంచి డీసీఎం వరిగడ్డి లోడుతో బయలుదేరింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ సమీపంలోని శ్రీనిధి స్కూల్ వద్దకు చేరుకోగానే విద్యుత్ వైర్లు వరిగడ్డికి తాకి మంటలు అంటుకున్నాయి. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో డీసీఎంను ఆపేసి డ్రైవరు కిందికి దిగాడు. దీన్ని గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో వచ్చి మంటలు ఆర్పారు. అప్పటికే వరిగడ్డి పూర్తిగా, డీసీఎం పాక్షికంగా కాలిపోయాయి.

అల్పాహారం.. అందనంత దూరం!

పేద విద్యార్థులకు ఆకలి మంటలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించేందుకు అల్పాహార పథకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. కానీ ఈ పథకానికి సరిపడా నిధులు కేటాయించడంలో పాలకులు విఫలమవ్వడంతో చిన్నారులకు అర్ధాకలి బాధ తప్పడం లేదు.

ప్రభుత్వ పాఠశాలల్లో అందని టిఫిన్

- బిల్లులు రాక నిలిపివేసిన నిర్వాహకులు
- అర్ధాకలితో చదువుకుంటున్న విద్యార్థులు
- పదోతరగతి వారికి కొనసాగుతున్న స్టడీ హవర్స్


బొంపల్లిలో అల్పాహారం తింటున్న విద్యార్థులు (ఫైల్)

దోమ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రత్యేక తరగతులతో పాటు వంద శాతం హాజరుశాతం పెంచేందుకు అల్పాహార పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం తీసుకొచ్చింది. గతేడాది దసరా కానుకగా గత ప్రభుత్వం సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలులోకి తీసుకువచ్చింది. అయితే సర్కారు బడుల్లో ఎక్కువగా నిరుపేద విద్యార్థులు చదువుకుంటున్నారన్న నేపథ్యంలో గత ప్రభుత్వం ఒకటో నుంచి పదో తరగతి వరకు ఈ పథకం అమలులోకి తీసుకువచ్చింది. చాలా మంది పిల్లలు దూర గ్రామాల నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ ఉండగా.. అల్పాహారం ఎంతో దోహదపడింది. కానీ పథకం ప్రారంభమైనప్పటికీ నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో నిర్వాహకులు ఆందోళనకు గురయ్యారు. జులై, ఆగస్టు నెల వరకు అల్పాహారం కొనసాగించి ఆ తరువాత పూర్తిగా నిలిపివేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు.

బిల్లులు రాకపోవడంతోనే..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 174 ఉన్నత పాఠశాలలు, 18 కేజీబీవీలు, 9 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. అందులో 12,486 మంది విద్యార్థులు పదో తరగతి విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన అల్పాహార కార్యక్రమాన్ని పాఠశాలకు వచ్చే విద్యార్థులకు 45 నిమిషాల ముందుగానే అందించేవారు. సోమవారం ఇడ్లీ సాంబర్, లేదా గోధుమరవ్వ ఉప్మా, చట్నీ, మంగళవారం పూరి, ఆలుకుర్మా లేదా టమాటబాత్, సాంబర్, బుధవారం ఉప్మాసాంబర్ లేదా బియ్యంరవ్వకిచిడీ, చట్నీ, గురువారం చిరుధాన్యాల ఇడ్లీ, సాంబర్, లేదా పొంగల్, సాంబర్, శుక్రవారం ఉగ్గని, అటుకులు, చిరుధాన్యాల ఇడ్లీ, చట్నీ, లేదా బియ్యంరవ్వకిచిడీ, చట్నీ, శనివారం పొంగల్, సాంబర్ లేదా కూరగాయాల పులావ్, పెరుగు చట్నీ, ఆలు కుర్మాలో మెనూగా పొందుపర్చి విద్యార్థులకు అందించేవారు. కానీ బిల్లులు సక్రమంగా రాకపోవడంతో నిర్వాహకులు నిలిపివేసినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా

దోమ మండల వ్యాప్తంగా 71 పాఠశాలలు ఉండగా అందులో 10 ఉన్నత పాఠశాలలు, 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 52 ప్రాథమిక పాఠశాలలు, ఓ కేజీబీవీ ఉన్నాయి. వీటిలో మొత్తం 5,221 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే ప్రభుత్వం పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని అల్పాహారం ప్రారంభించినప్పటికీ బిల్లులు సక్రమంగా రాకపోవడంతోనే నిర్వాహకులు వాటిని నిలిపివేశారు. మరోపక్క జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలో స్వచ్ఛంద సంస్థల దాతృత్వంతో పలు పాఠశాలల్లో అల్పాహార పథకం కొనసాగుతుండడం గమనార్హం.

నిరాశలో చిన్నారులు

పదో తరగతి విద్యార్థులు ఉదయం పాఠశాలకు ముందుగానే వస్తుండడంతో పాటు సాయంత్రం ఇంటికి ఆలస్యంగా వెళ్తుంటారు. దోమ మండల వ్యాప్తంగా 422 మంది విద్యార్థులు చదువుకుంటుండగా ఉదయం అల్పాహారం, సాయంత్రం కనీసం స్నాక్స్ కూడా ఇవ్వడం లేదని ఆవేదన చెందుతున్నారు. గతంలో పదో తరగతి విద్యార్థులకు విద్యాశాఖ ప్రత్యేక నిధులు కేటాయించి స్నాక్స్ అందించేది. కానీ ప్రస్తుతం స్నాక్స్‌తో పాటు అల్పాహారం సైతం నిలిపివేయడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అటు ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా ఇంకా స్పష్టత ఇవ్వకపోవడంతో చిన్నారులు నైరాశ్యానికి గురవుతున్నారు.

అల్పాహారం అందించాలి



పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందిస్తే ఎంతో మేలు జరుగుతుంది. కనీసం స్నాక్స్ అయినా అందించాలి. పాఠశాలలో సాయంకాలం లేట్ అవుతుండడంతో అర్ధాకలితో చదువుకోవాల్సి వస్తుంది. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకొని అల్పాహారం, స్నాక్స్ అందించేలా చర్యలు తీసుకోవాలి.

– హారిక, పదో తరగతి విద్యార్థిని, కిష్టాపూర్

దాతలు స్పందించాలి



నిర్వాహకులకు బిల్లులు రాక అల్పాహార పథకం నిలిపి వేశారు. మండలంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి. దాతలు ముందుకు వస్తే స్నాక్స్, అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటాం. తమ వంతుగా పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఇప్పటికి వరకు స్పష్టత రాలేదు.

– వెంకట్, ఎంఈఓ, దోమ

బాలుడి మృతి కారకుడికి ఏడేళ్ల జైలు


బాల్‌రాజ్

షాబాద్: ద్విచక్ర వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష పడింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన దర్శనాల బాల్‌రాజ్ అనే వ్యక్తి 2020, డిసెంబర్ 3న తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని సర్దార్‌నగర్‌కు వెళ్తుండగా అతను వాహనాన్ని అజాగ్రత్తగా, అతి వేగంగా నడుపుతూ లారీని చూసుకోకుండా ముందుకు వెళ్లడంతో వెనుక కూర్చున్న బాలుడు రోడ్డుపై కిందపడి మృతిచెందాడు. ఈ విషయంలో అప్పట్లో పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో నేరం రుజువు కావడంతో ఎల్బీనగర్ జిల్లా కోర్టులో దర్శనాల బాల్‌రాజ్‌కు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధించినట్లు సీఐ కాంతారెడ్డి తెలిపారు.

యువకుడి అదృశ్యం


మహ్మద్ ఇషాక్ (ఫైల్)

పహాడీషరీఫ్: యువకుడు అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట బిస్‌ట్రిప్ కాలనీకి చెందిన మహ్మద్ ఇషాక్(21) వృత్తిరీత్యా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. పది రోజుల క్రితం పని నిమిత్తం బయటికి వెళ్లిన ఇషాక్ తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయమై కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించినా ఫలితంలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే బాలాపూర్ పోలీస్‌స్టేషన్లో గానీ 87126 62366 నంబర్‌పై గానీ సమాచారం చేరవేయాలని పోలీసులు తెలిపారు.

ప్రయాణికురాలి పర్సు అప్పగింత



ప్రయాణికురాలికి పర్సు అప్పగిస్తున్న ఆర్టీసీ సిబ్బంది


ఆమనగల్లు: బస్సులో పోగొట్టుకున్న పర్సును తిరిగి ప్రయాణికురాలికి ఆర్టీసీ సిబ్బంది అప్పగించారు. ఈ సంఘటన ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామానికి చెందిన అనిత మహేశ్వరం డిపో బస్సులో ఆమనగల్లుకు వచ్చింది. అక్కడ బస్సు దిగుతున్న క్రమంలో అనిత పర్సు బస్సులో పడిపోయింది. అనంతరం బస్సు కండక్టర్ రూప్‌సింగ్, డ్రైవర్ రజనీకాంత్‌లు పర్సును గుర్తించి భద్రపరిచారు. ఆమె పోగొట్టుకున్న పర్సుగురించి ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్‌లోని కంట్రోలర్ జగదీశ్వర్‌కు తెలిపింది. ఈ విషయంపై డ్రైవర్‌ను సంప్రదించగా పర్సు తమ వద్దే ఉందని బదులిచ్చారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్‌లో సిబ్బంది ప్రయాణికురాలికి పర్సులోని రూ.12వేలు అప్పగించారు.

లోహిత్ ఆత్మహత్యకు నారాయణ పాఠశాలదే బాధ్యత

బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంమూర్తి గౌడ్

తుర్కయంజాల్: హయత్‌నగర్ నారాయణ పా ఠశాలలో ఏడోతరగతి విద్యార్థి లోహిత్ ఆత్మహత్యకు పూర్తి బాధ్యత యాజమాన్యమే వహించాలని బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతుల రాంమూర్తి గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్న మేనేజ్‌మెంట్ తీరులో మార్పురావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి ఆత్మహత్యపై విచారణ చేపట్టి దీనికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

మానవ హక్కుల వేదిక కన్వీనర్‌గా రాజు నాయక్



ఇబ్రహీంపట్నం: మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్‌గా ఇబ్రహీంపట్నంకు చెందిన సపావట్ రాజు నాయక్‌ను నియమించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతరపురంలో నిర్వహించిన ఉభయ రాష్ట్రాల పదో మహాసభల్లో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు భుజంగరావు, ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షుడు జీవన్‌కుమార్ తనను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు రాజునాయక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా నూతన కన్వీనర్ రాజునాయక్ మాట్లాడారు. మానవ హక్కుల ఉల్లంఘన రోజురోజుకు పెరుగుతుందన్నారు. కుల వివక్షతను రూపుమాపడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టాలకే పరిమితమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కన్వీనర్‌గా తనను నియమించిన వారికి, సహకరించిన ప్రతి ఒక్కరికీ రాజునాయక్ కృతజ్ఞత తెలిపారు.

గ్రామ పంచాయతీ బోరు ధ్వంసం

దుద్యాల్: గ్రామానికి నీటి సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన బోరు మోటారును ధ్వంసం చేసిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. దుద్యాల్ గ్రామానికి నీరు అందించేందుకు శివాలయం దగ్గర ఉన్న దేవుని చెరువులో ప్రభుత్వ బోరు ఉంది. గ్రామానికి చెందిన తలారి నవీన్ బోరు మా భూమిలో ఉందని ఆరోపించాడు. బోరు స్టార్టర్, కేసింగ్ పైపును ధ్వంసం చేశాడు. గమనించిన పంచాయతీ కార్యదర్శి సదరు వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బొంరాస్‌పేట్ ఎస్‌ఐ రవూఫ్ విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న టవేరా

డ్రైవర్‌కు తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు


క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు

షాద్‌నగర్‌రూరల్: విద్యుత్ స్తంభాన్ని టవేరా వాహనం ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలో రాయికల్ సమీపంలోని టోల్‌ప్లాజావద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన విశ్వనాథ్‌శెట్టి ట్యాక్సీ వాహనం(టవేరా) నడిపిస్తు కుటుంబంతో నివసిస్తున్నాడు. విశ్వనాథ్‌శెట్టి తన టవేరా వాహనాన్ని నడుపుకుంటూ జడ్చర్లపైవు నుంచి షాద్‌నగర్‌వైపు వస్తున్నక్రమంలో రాయికల్ సమీపంలోని టోల్‌ప్లాజావద్ద అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ విశ్వనాథ్‌శెట్టి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో ప్రమాద స్థలానికి కొద్ది దూరంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ రవీందర్‌నాయక్ సిబ్బంది ఎల్లాగౌడ్, మురళీ, దీపక్, సంతోష్, నర్సింగ్‌రాథోడ్‌లు ఘటనా స్థలానికి వెళ్లారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ట్రాఫిక్ పోలీస్ వాహనంలో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో మానవత్వంతో సకాలంలో స్పందించి గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించిన ట్రాఫిక్ పోలీసులకు పట్టణ వాసులు అభినందనలు తెలియచేస్తున్నారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మృతి

పలువురి నివాళులు


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ తండ్రి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చీపురు జంగయ్యయాదవ్ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతిపట్ల పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుడు జంగయ్యయాదవ్ కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వియ్యంకుడు కావడంతో ఆయన పాడె మోశాడు. అంతకుముందు జంగయ్యయాదవ్ భౌతిక కాయం వద్ద మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ యాట నర్సింహా, మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు నిర్మల శ్రీశైలం, రవీందర్ యాదవ్, మాజీ జెడ్పీటీసీలు పత్యానాయక్, దశరథ్‌నాయక్, పీసీసీ కార్యదర్శి మోహన్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. మృతుని కుమారులు శ్రీనివాస్‌యాదవ్, రవియాదవ్, శేఖర్‌యాదవ్, కూతురు మాధవి, భార్య లక్ష్మీదేవమ్మలను పలువురు పరామర్శించారు. అంత్యక్రియలు తలకొండపల్లి మండలం వెల్జాల్‌గ్రామంలో మంగళవారం నిర్వహించారు.

పాస్ బుక్.. పరేషాన్!

- రిజిస్ట్రేషన్ అయినా అందని పట్టా పుస్తకాలు
- పత్రాల కోసం ఎదురుచూపులు
- ఎలాంటి స్పష్టతనివ్వని అధికారులు


పట్టా పాసు పుస్తకాలు

దౌల్తాబాద్: భూములు క్రయవిక్రయాలు చేసిన పట్టాదారులకు పాసుపుస్తకాలు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సబ్‌రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పట్టా చేసిన నిమిషాల వ్యవధిలోనే పాసు పుస్తకాలు అందజేస్తామని గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. వాటి బాధ్యతలను తహసీల్దార్లకు అప్పగించింది. గతంలో వారం, పదిహేను రోజుల్లో పట్టా పాసుపుస్తకాలు వచ్చేవి. కానీ గత మూడు నెలల నుంచి పట్టాలు చేసుకున్న పట్టాదారులకు సకాలంలో పాసుపుస్తకాలు రాక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

మూడు నెలలుగా ఇబ్బంది

మండలంలో భూములు కొనుగోళ్లు చేసుకున్న పట్టాదారులు గత మూడు నెలల నుంచి సుమారు 300కుపైగా మంది ఉన్నట్లు సమాచారం. వీరికి పట్టా పాసు పుస్తకాలు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పాసు పుస్తకాల కోసం తహసీల్దారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. భూములు రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న పట్టాదారులు నిత్యం పోస్ట్ సిబ్బందిని కలిసి పాసు పుస్తకాల కోసం ఆరా తీస్తున్నారు. మూడు నెలల నుంచి పాసుపుస్తకాలు అందకపోవడంపై అధికారుల వద్ద స్పష్టత లేదు. పాసు పుస్తకాల కోసం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ఆరా తీస్తున్నారు. అధికారులు సరైన సమాధానం చెప్పక మాట దాటవేస్తున్నారు. పాసు పుస్తకాలు నేరుగా పోస్ట్ ద్వారా ఇంటికి వస్తాయని చెబుతున్నా మూడు నెలల నుంచి రాకపోవడానికి కారణం ఏంటని ఆందోళన చెందుతున్నారు.

సంక్షేమ పథకాలకు అడ్డంకి

భూములు కొనుగోలు చేసిన వారికి పాసు పుస్తకాలు రాకపోవడంతో సంక్షేమ పథకాలకు అడ్డంకిగా మారింది. పంట రుణాలు ఇతర దీర్ఘకాలిక రుణాలు, రైతుబీమా, రైతుభరోసా మార్టిగేజ్ రుణాలు పంటలు విక్రయించుకునేందుకు పాసుపుస్తకాలు లేక యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పోస్టాఫీసులో అడగండి

మూడు నెలల నుంచి పాసుపుస్తకాలు అందలేకపోవడంపై పూర్తి సమాచారం లేదు. అయితే ఎవరైనా రైతులు పట్టా పాసుపుస్తకం వచ్చిందో లేదో స్థానిక పోస్టాఫీసులో అడగండి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి త్వరలో పరిష్కరిస్తాం.

– గాయత్రి, తహసీల్దారు, దౌల్తాబాద్